నాలుగో రోజు ఆరు నామినేషన్లు

- మిర్యాలగూడలో మూడు, నాగార్జునసాగర్‌లో ఒకటి, దేవరకొండలో రెండు దాఖలు





మిర్యాలగూడ : నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి కృష్ణయ్య పిరమిడ్ పార్టీ అభ్యర్థి బంటు రవి

మిర్యాలగూడ : మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి సోమవారం మూడు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ ఎన్నికల అధికారి చెన్నయ్య తెలిపారు. అందులో స్వతంత్ర అభ్యర్థిగా బొలుసాని కృష్ణయ్య, బీజేపీ అభ్యర్థిగా జవ్వాజి సత్యనారాయణ, పిరమిడ్ అభ్యర్థిగా బంటు రవి నామినేషన్ దాఖలు చేశారు. తమ నామినేషన్ పత్రాలను ఆరో చెన్నయ్యకు అందజేశారు. ఆర్‌ఓ కార్యాలయానికి ఇరువైపులా భారీ పోలీసు బందోబస్తును డీఎస్పీ వెంకటగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వంద మీటర్ల దూరంలో బారికేడ్లను ఏర్పాటు చేసి ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వాహనాలను దారి మళ్లించారు.

దేవరకొండలో రెండు..

దేవరకొండ : దేవరకొండ అసెంబ్లీ స్థానానికి సోమవారం రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కేలావత్ వశ్యా స్వతంత్ర అభ్యర్థిగా తన నామినేషన్ దాఖలు చేయగా , బీఎస్పీ అభ్యర్థి ముడావత్ వెంకటేశ్ తన నామినేషన్ సమర్పించాడు. ఇప్పటి వరకు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. మొదటి రోజు మూడు, సోమవారం మరో రెండు దాఖలయ్యాయి.

నాగార్జునసాగర్‌లో ఒకటి..

నిడమనూరు : నాగార్జునసాగర్ అసెంబ్లీ స్థానానికి ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి జె.శ్రీనివాస్ తెలిపారు. ఎంసీపీఐ(యూ) తరఫున పోతుగంటి కాశయ్య నామినేషన్ దాఖలు చేశాడు. దీంతో ఇప్పటి వరకు ముగ్గురు స్వతంత్రులు, ఒకరు పార్టీ తరఫున నామినేషన్లు వేశారు.

పటిష్ట బందోబస్తు

నిడమనూరు నామినేషన్ కేంద్రం వద్ద టీసీఎస్‌ఎస్‌పీ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద ఒక డీఎస్పీ, ఇద్దరు సీఐలు,ఆరుగురు ఎస్ఐలు, 50మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి వంద మీటర్ల పరిధిలో బారికేడ్లు ఏర్పాటు చేశారు.





దేవరకొండ : నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి కేలావత్ వశ్యా, బీఎస్పీ అభ్యర్థి వెంకటేష్ చౌహాన్,



నిడమనూరు : ఎన్నికల అధికారి శ్రీనివాస్‌కు నామినేషన్ అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) అభ్యర్థి పోతుగంటి కాశయ్య

క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ

దేవరకొండ : ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ఎన్నికల నిర్వహణపై రెండో విడత శిక్షణ ప్రారంభమైంది. దేవరకొండ పట్టణంలోని ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పీఓ, ఏపీఓ, ఓపీఓలకు మాస్టర్ ట్రైనర్స్ రెండో విడత శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా ఎన్నికల విధివిధానాలను వివరిస్తూ పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలని సూచించారు. నేటితో రెండో విడత శిక్షణ పూర్తి కానున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పీఓ, ఏపీఓ, ఓపీఓలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

దేవరకొండ : ఈనెల 3, 4తేదీల్లో నిర్వహించిన ఇంటర్ కళాశాల టోర్నమెంట్–2023 కబడ్డీ పోటీల్లో దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను అభినందించారు. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను అభినందించిన వారిలో కళాశాల అధ్యాపకులు, తదితరులున్నారు.

ఆర్థిక సాయం అందజేత

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల కేంద్రానికి చెందిన నంది బిక్షం తల్లి లక్ష్మమ్మ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు పగడాల సైదులుయాదవ్ ఆమె మృతదేహన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి అంతిమ దహన సంస్కారాలకు తక్షణ సాయంగా కుటుంబ సభ్యులకు రూ.10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యసహకార సంఘం చైర్మన్ పిట్టల కృష్ణ, నాయకులు పాతనబోయిన భాస్కర్, చింతల రామాంజి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సాయం అందజేస్తున్న సైదులు

పెద్దవూర : మండలంలోని చిన్నగూడెం గ్రామానికి చెందిన జానపాటి వెంకటయ్య ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నాగార్జునసాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి సోమవారం మృతుడు స్వగ్రామమైన చిన్నగూడెం వెళ్లి వెంకటయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్, బాలయ్య, రాంరెడ్డి, నడ్డి శివకుమార్, కురాకుల శ్రీనివాస్, రావుల ఉపేందర్ పాల్గొన్నారు.

అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు

డిండి: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లిన ఘటన సోమవారం డిండి మండల పరిధిలోని బాపన్‌కుంట సమీపంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డిండి మీదుగా దేవరకొండకు వెళ్తోంది. ఈక్రమంలో మండల పరిధిలోని బాపన్‌కుంట సమీపంలోకి రాగానే ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ బ్రేక్ వేయడంతో రోడ్డు పక్కనే నిలిచింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న అక్కడే ఉన్న బాపన్‌కుంట కాలువలోకి బస్సు దూసుకెళ్లేదని ప్రయాణికులు పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు వర్క్‌షాప్

రామగిరి(నల్లగొండ): తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో 120 మంది వలంటీర్లకు ఒక రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉపేందర్ మాట్లాడుతూ శిక్షణ పొందిన వలంటీర్లు ఈ నెల 18 నుంచి ఆయా పాఠశాలలకు వెళ్లి విద్యలో వెనుకబడిన విద్యార్థులకు తగిన నైపుణ్యాలను బోధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఈ.యాదగిరిరెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఎస్.యాదగిరి, డాక్టర్ ఎస్.వేణు, కె.శివరాణి, పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

హాలియా : మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో నల్లగొండలో నిర్వహించిన త్వైక్వాండో, బాస్కెట్‌బాల్, కబడ్డీ పోటీల్లో హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయం సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్ సోమవారం తెలిపారు. అక్టోబర్ 24 నుంచి నవంబర్ 4వ తేదీ వరకు నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ టోర్నమెంట్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి అంగోతు వెంకటేష్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి త్వైక్వాండ్ 80 కిలోల విభాగంలో త్వరలో రాజస్థాన్‌లో నిర్వమించే వెస్ట్ జోన్ పోటీలకు అర్హత సాధించారని, విద్యార్థి పి రమేష్ బాస్కెట్ బాల్ విభాగంలో కేరళలో జరిగే సౌత్ జోన్ పోటీలకు అర్హత సాధించగా విద్యార్థులు దుగ్యాల సందీప్, పేర్ల మధు, గోపిశెట్టి వేణుగోపాల్, ధనావత్ అఖిల్‌కుమార్ ఏపీ రాష్ట్రంలోని కాకినాడలో జరిగే సౌత్‌జోన్ పురుషుల కబడ్డీ పోటీకి అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. వివిధ క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్స్‌పాల్ రవికుమార్, వైస్ ప్రిన్స్‌పాల్ ఒంటెపాక యాదయ్య, లెక్చరర్లు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఫరంగి రవికుమార్

బీఆర్‌ఎస్‌లో చేరిక

దేవరకొండ : దేవరకొండ, కొండమల్లేపల్లి మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ అభ్యర్థి రవీంద్రకుమార్ సమక్షంలో సోమవారం ఆ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీల్యానాయక్, హన్మంతు వెంకటేష్, దస్రునాయక్, కేసాని లింగారెడ్డి, పస్నూరి యుగేందర్‌రెడ్డి, మారుపాకుల సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ పార్టీ యూత్ మాజీ మండల అధ్యక్షుడు అభిషేక్ నాయక్ సోమవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కొండమల్లేపల్లిలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పస్నూరి యుగేందర్‌రెడ్డి, టోపియానాయక్, రమావత్ దీప్‌లాల్ నాయక్, రాజలింగం, తులసిరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గణితంపై ఉచిత శిక్షణ

నకిరేకల్ : దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో మాస్టర్స్ చదవడం కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు గణితంపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో ఫిబ్రవరిలో నిర్వహించే ఐఐటీ జామ్(జాయింట్ అడ్మిషన్ ఫర్ మాస్టర్స్), సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ ద్వారా అభ్యర్థులకు ప్రతిరోజు సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు తరగతులు నిర్వహిస్తూ మోడల్ టెస్ట్ సిరీస్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9701275354 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సెయింట్ జోసెఫ్ విద్యార్థులు

నాగార్జునసాగర్ : ఉమ్మడి జిల్లా స్కూల్‌గేమ్స్‌అండర్14, అండర్17 బాస్కెట్‌బాల్ సెలక్షన్‌లో నాగార్జునసాగర్ హిల్‌కాలనీ సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. హుజూర్‌నగర్‌లోని వీవీఎం ఉన్నతపాఠశాలలో బాల, బాలికలను ఎంపిక చేశారు.అండర్–14 బాలుర విభాగంలో వెంకటసాయికృష్ణ, ఆర్. బాలు ఎంపిక కాగా, బాలికలు బి. కరుణ, ఎస్.రమితలు ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో పి.నాగరాజు, జె.పృథ్వీరాజ్, బి.లక్ష్మణ్, కె.జాయిస్ ప్రణీత్‌లు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎం.డి.సభానూర్, జె.సుష్మవిరాజ్, బి.కీర్తన, ఎస్‌కె.రిజ్వానా, పి.దీప్తిలు ఎంపికయ్యారు. వీరు గద్వాల జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను సోమవారం పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ అన్నమ్మ, సుపీరియర్ సిస్టర్‌బాల ట్రీజ, సిస్టర్‌కార్ల, హనుమకుమార్, పీఈటీ కిరణ్‌కుమార్‌లు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పగిడి జీడయ్యయాదవ్‌కు సన్మానం



పగిడి జీడయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిగా ఇటీవల ఎన్నికైన పగిడీ జీడయ్యయాదవ్‌ను సోమవారం దామరచర్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీడయ్య యాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి ప్రజలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో 12 స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అల్లం నాగరాజుయాదవ్, బత్తుల శ్రీనివాస్, ఎస్‌కె.సద్దాం, శివ చరణ్, ఖాదర్, దుర్గారావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, రామయ్య, విజయ్, శ్రీనివాస్,పాల్గొన్నారు.


మద్యం పట్టివేత

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ నుంచి మాచర్లకు అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐలు పీకే రెడ్డి, సాలకమ్మ సోమవారం తెలిపారు. ఎన్నికల కోడ్‌లో భాగంగా తనిఖీలు చేస్తుండగా 11 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని, వీటిని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో రైల్వే పోలీసులు వెంకన్న, రాంబాబు పాల్గొన్నారు.

కన్నతల్లి పట్ల కర్కశత్వం

- తల్లిని తీవ్రంగా కొట్టి వైకుంఠధామంలో వదిలేసిన కొడుకు, కోడలు

మిర్యాలగూడ టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన కన్నతల్లిని కొట్టి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని వైకుంఠధామంలో వదిలేసి వెళ్లాడు. ఆ వృద్ధురాలు రెండు రోజుల పాటు అక్కడే నరకయాతన పడింది. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన చింతకాయల వెంకటరత్నమ్మ– ఏడుకొండలుకు కుమారుడు వెంకటేశ్వర్లు, కుమార్తె తిరుపతమ్మ ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. వెంకటేశ్వర్లు తన భార్యతో కలిసి కూలీనాలీ చేసుకుంటూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. వెంకటేశ్వర్లు భార్యకు, ఆయన తల్లి వెంకటరత్నమ్మకు నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఆమెకు వచ్చే పింఛన్ వీరికి ఇవ్వకపోవడంతో కొడుకు, కోడలు ఆమెపై కోపం పెంచుకున్నారు. ఈక్రమంలో శనివారం వెంకటేశ్వర్లు, తన భార్యతో కలిసి ఆమెను తీవ్రంగా చితకబాది ఆటోలో వచ్చి మిర్యాలగూడ మండలం వాటర్ ట్యాంకుతండా వద్ద గల వైకుంఠధామంలో వదిలేసి వెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామానికి చెందిన పంచాయతీ సిబ్బంది రవి మొక్కలకు నీళ్లు పోసేందుకు వెళ్లగా వృద్ధురాలు వైకుంఠధామంలో ఒంటరిగా పడి ఉండటంతో సర్పంచ్ ధనావత్ రాంచందర్‌నాయక్‌కు సమాచారాన్ని తెలిపాడు. ఆయన మిర్యాలగూడ రూరల్ పోలీసులతో పాటు వయోవృద్ధుల సంక్షేమ శాఖకు సమాచారం అందించగా.. ఏఎస్ఐ ఉమాపతిరావు, ఫీల్డ్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి అక్కడకు చేరుకున్నారు. వృద్ధురాలికి ఫిట్స్ రావడంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తన కొడుకు, కోడలు నిత్యం తనను కొడుతున్నారని వృద్ధురాలు అధికారులతో వాపోయింది. దీంతో పోలీసులు ఆమె కుమారుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం అతడి ద్వారా లిఖిత పూర్వకంగా రాయించుకున్నారు. వృద్ధురాలిని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు.



వాటర్‌ట్యాంకు వద్ద గల వైకుంఠధామంలో పడి ఉన్న వృద్ధురాలు

వృద్ధురాలికి సిద్ధార్థ పరామర్శ

మిర్యాలగూడ : దాచెపల్లి మండలం గామాలపాడు గ్రామానికి చెందిన చింతకుంట్ల వెంకటరత్నమ్మ అనే 70ఏళ్ల వృద్ధురాలు నిరాధరణకు గురై గాయాలపాలై స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను సోమవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ యువనాయకుడు సిద్ధార్థ పరామర్శించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడిన సిద్ధార్థ అనంతరం బాధితురాలికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

భాస్కర్ రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిక

మిర్యాలగూడ : మిర్యాలగూడ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ యూనియన్‌కు చెందిన 400 మంది కార్మికులు యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎన్‌వీఎన్.బ్రహ్మచారి ఆధ్వర్యంలో అభ్యర్థి భాస్కర్ రావు సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి భాస్కర్‌రావు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అమృతం సత్యం, దుండిగాల అంజయ్య, కార్మికులు రవికుమార్, సురేష్, రాజేష్, హమీద్, నాగరాజు, జయరాజు, జలీల్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న భాస్కర్‌రావు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థి పవన్‌ను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ భిక్షపతి

హాలియా : అండర్–17 స్కూల్ గేమ్స్ నెట్ బాల్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు స్థానిక అక్షయ హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ షేక్ వహీద్ సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థి బి పవన్ ఈనెల 1న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ నెట్ బాల్ సెలక్షన్స్ నిర్వహించారని, ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థి పవన్ పాల్గొని క్రీడల్లో చక్కటి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల ఖమ్మంలో నిర్వహించే రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి పవన్‌ను పాఠశాల డైరెక్టర్ బిక్షపతి, ప్రిన్స్‌పాల్ సెబాస్టియన్, వ్యాయామ ఉపాధ్యాయుడు మంగ్యానాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో గల టీఆర్‌ఆర్ కాటన్‌మిల్లులో సోమవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని సోమవారం శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి చీనానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నికి తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని కోరారు. పత్తిలో తేమశాతం 8 నుంచి 12 వరకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. రైతుల ప్రయోజనం కోసం ఏర్పాటైన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కమ్యూనిస్టులను గెలిపించి అసెంబ్లీకి పంపండి

మిర్యాలగూడ: ప్రజల గొంతుకై వివిధ సమస్యలపై పోరాడుతున్న కమ్యూనిస్టులను గెలిపించి అసెంబ్లీకి పంపించాలని సీపీఎం మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి కోరారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న తనకు ఈ ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజారిటీ అందించాలన్నారు. తాను గెలిచిన వెంటనే మిర్యాలగూడ జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తానని, జర్నలిస్టులకు 300గజాల ఇంటి స్థలాన్ని కేటాయించడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్మికులకు కనీస వేతనం అమలయ్యే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ప్రతిరోజూ కుల, ఇతర సంఘాలతో సమావేశాలు జరిపి దావత్‌లు ఇస్తూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారన్నారు. ప్రలోభాలకు గురిచేసే అభ్యర్థుల పట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలిసి వచ్చే పార్టీలతో ఈ ఎన్నికల్లోకి ముందుకెళ్తామన్నారు. ఈనెల 9న తాను నామినేషన్ వేస్తానని, దీనికి నియోజకవర్గ పరిధిలో వేలాది మంది పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, నూకల జగదీష్‌చంద్ర, సత్యనారాయణరావు, తిరుపతి రామ్మూర్తి, వరలక్ష్మి, చౌగాని సీతారాములు, కె.రమేష్, పాపిరెడ్డి, సైదులు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ఖాజామోయినొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

హాలియా : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, బైరెడ్డి కోటిరెడ్డి ఆధ్వర్యంలో అనుముల మండలంలోని శ్రీనాథపురం గ్రామ ఎంపీటీసీ కొండ రమేష్, చింతగూడెం గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు సోమవారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎడమ కాల్వ మాజీ వైస్ చైర్మన్ మలిగిరెడ్డి లింగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, సీనియర్ నాయకులు కుందూరు రాజేందర్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గౌనీ రాజారమేష్ యాదవ్, బానుచందర్‌రెడ్డి, నకిరేకంటి సైదులు, మహేష్, శేఖర్‌రెడ్డి, ఏడుకొండలు, కష్టారెడ్డి, సత్యనారాయణ, సాజిద్, మధు పాల్గొన్నారు.

త్రిపురారం : మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో 10కుటుంబాలు, అంజన పల్లిలో 20కుటుంబాలు, రాగడపలో 25కుటుంబాల బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికా ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, అనుముల వెంకట్ రెడ్డి, కసిరెడ్డి నరేష్, అనుముల నర్సిరెడ్డి, సలికంటి బాలకృష్ణ, మహిళ అధ్యక్షురాలు పద్మ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిడమనూరు : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు రావిరాల శ్రీలత, మండలంలోని వేంపాడ్‌కు చెందిన నాయకులు సోమవారం జైవీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రామేశ్వరి, సర్పంచ్ మేరెడ్డి పుష్పలత, శ్రీనివాసరెడ్డి, సత్యం, నర్సింగ్ విజయ్ కుమార్, శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.



హాలియా : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి జైవీర్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నేతలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుడితండా గ్రామపంచాయతీలో వివిధ పార్టీల నుంచి దేవరకొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నేనావత్ బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమన్‌రెడ్డి, ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నర్సింహా, దేవేందర్‌నాయక్, పాల్గొన్నారు.

చింతపల్లి : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సోమవారం మండల పార్టీ నాగభూషణం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్ గెలుపుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ హరినాయక్, పవన్, కాసారపు శ్రీనివాస్, ప్రసాద్, శ్రీశైలం పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణలో హిమజ సేవలు అభినందనీయం

గుర్రంపోడు : పాఠశాల నిర్వహణలో మండలంలోని పిట్టలగూడెం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం హిమజ సేవలను అభినందనీయమని రిటైర్డ్ మండల విద్యాధికారులు గోపిడి బిక్షంరెడ్డి, చింతరెడ్డి ముత్యంరెడ్డిలు కొనియాడారు. బదిలీపై వెళ్లిన ఆమెను సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. పూలమాల , శాలువాలతో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి. గీత, టీచర్లు మంజుల, యాదగిరిరెడ్డి, వీరస్వామి, శేఖర్, విజయపాల్, రఘునాథ్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, కల్పన, జగదీశ్వర్‌రెడ్డి, సుల్తానా, రేఖ పాల్గొన్నారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

కేతేపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం కురిసిన అకాల వర్షానికి ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి ధాన్యం రాశులు తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వరి కోతలు ప్రారంభించిన రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చారు. ధాన్యంలో తేమశాతం తగ్గించేందుకు ఆయా కేంద్రాలతోపాటు సర్వీసు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టారు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఆరబెట్టిన ధాన్యంపై రైతులు పట్టాలు కప్పే ప్రయత్నం చేశారు. అయితే వర్షం జోరుగా కురవడంతో ధాన్యం తడిసిపోయింది. ధాన్యం తడిసిపోవడంతో కాంటాలు వేయాలంటే మరో వారం రోజులపాటు ఆరబెట్టాల్సి ఉంటుందని రైతులు వాపోతున్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ షీట్ అందజేయాలని కోరారు.

గిరిజనులంతా బీఆర్‌ఎస్ వైపే

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నియోజకవర్గంలో గిరిజనులంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురావునాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గిరిజన నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బిక్షానాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, సర్పంచ్‌లు చందూలాల్, రాంసింగ్, బిచ్చానాయక్, దూప్‌సింగ్, నాయకులు రమేష్, బాలు, హరిసింగ్, శంకర్‌నాయక్, హనుమ, రతన్, హాతీరాం తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

పెద్దవూర: గిరిజనుల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల గిరిజన ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి తమనే తామే పాలించుకునేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు బాణావత్ శంకర్‌నాయక్, జానీవెంకటేశ్వర్లు, విజయ బాలవర్ధిరాజు, శంకర్, పీఏసీఎస్ డైరెక్టర్ కిషన్‌నాయక్, నాయకులు పాల్గొన్నారు.



పెద్దవూర : మాట్లాడుతున్న రవినాయక్